# వెల్‌కం టు అమెరికా!

గోపి బూరుగు






© 03/2006 Gopi Burugu - gburugu@yahoo.com

ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్

"హలో!"

"హలో అండి, నేను ఏటీ.అన్.టి నుండి, అమూల్యను మాట్లాడుతున్నాను. శ్రీనివాసు మల్లెపందిరి గారున్నారా?"

"నేను శ్రీనివాసు మల్లెపందిరి గారినే మాట్లాడేది. ఏ ఏటి నుండన్నారు?"

"హిహి శ్రీనివాసు మల్లె పందిరి గారూ, నేను ఏ.టి. అండ్‌టి ఫోన్ సర్వీసు కంపెనీ నుండి అమూల్యను మాట్లాడుతున్నాను"

"........."

"మిమ్మల్ని 'శీనివాస్ గారూ' అని పిలవొచ్చాండి శ్రీనివాస్ గారూ?"

"పిలవచ్చుండి, అమూల్యగారు"

"మీ టెలీఫోన్ లాంగ్ డిస్టెన్స్ కారియర్ ఏంటండి, శ్రీనివాస్ గారూ?"

"స్టార్టెక్ అండి, అమూల్యగారు"

"ఆ.....? ఏం టెక్కు అన్నారూ?"

"స్టార్ టెక్ అండి!"

"ఏటీ.అన్.టీలో కొత్తగా ఒక అద్భుతమైన ప్లాన్ ఇంట్రడ్యూస్ చేస్తున్నామండి, శ్రీనివాస్ గారూ, మీరు ఇండియాకు చేసే కాల్స్‌కి మినెట్‌కి తర్టీఫైవ్ సెంట్స్ - వితిన్ యునైటెడ్ స్టేట్స్ లాంగ్ డిస్టెన్స్‌కి, నిమిషానికి ఫైవ్ సెంట్స్ మాత్రమే! మీ సర్వీస్‌ని ఏ.టీ. అన్‌టి కి స్విచ్ చేస్తారా?"

"....ఓహో అలాగా? కానీ నేనిప్పుడు ఇండియా కాల్స్‌కి నిమిషానికి ట్వంటీ టూ సెంట్స్ మాత్రమే పే చేస్తున్నా...."

"కానీ ఏ.టీ.అన్‌టి చాలా మంచి కంపెనీ అండి, కస్టమర్ సర్వీసు చాలా బాగుంటుంది. కస్టమర్స్‌ని సాటిస్‌ఫై చేయడానికి ఇరవై నాలుగ్గంటలూ, వారానికి ఏడు రోజులూ,

వరల్డ్ వైడ్‌గా ఉన్న మా కస్టమర్ సర్వీస్ సెంటర్లు కిందా మీదా పడి కొట్టుకుంటాయి.... హిహి"

"వరల్డ్ వైడ్ గా మీకు కష్టమర్ సర్వీసులున్నాయా?"

"వరల్డ్‌వైడ్‌గా అంటే, ఇండియా మొత్తం అనుకోండి."

"ఇండియా మొత్తం?!"

"ఇండియా మొత్తం అంటే ... ఏ.పి మొత్తం అనుకోండి"

"ఏ.పి మొత్తం?"

"ఏ.పి మొత్తం అంటే, హైదరాబాద్ మొత్తం అనుకోండి"

"హైదరాబాద్ మొత్త... సారీ అమూల్యగారు, మాకిప్పుడున్న సర్వీసే ఇన్ఎక్స్‌పెన్సివ్‌గా ఉంది"

"అయితే స్విచ్ అవ్వలేరాండి, శ్రీనివాస్ గారూ?"

"లేదండి, ఖచ్చితంగా స్విచ్ అవలేం చీప్‌గా వస్తున్న సర్వీసు నొదులు కొని కాస్ట్లీ సర్వీసుకి ఎందుకు స్విచ్ అవుతాం?"

"ఖచ్చితంగా?"

"ఖచ్చితంగా!"

"......."

"హలో?"

"ఆ! శ్రీనివాస్ గారూ, నేను లైన్‌లోనే ఉన్నాను"

"......."

"మీరు యూ. ఎస్ లో ఎక్కడుంటారండి?"

"కనెక్టికట్లో ఉంటానండి..... మీరు హైద్రాబాడ్ నుండీ మాట్లాడుతున్నారా?"

"అవునండి హైదరాబాద్ నుండే... అక్కడ లైఫ్ ఎలా ఉంటుందండీ శ్రీనివాస్ గారూ?"

"చాలా బిజీ లైఫండీ, అస్సలూ తీరికుండదు, ఎప్పుడైనా కాస్తో కూస్తో తీరిక దొరికితే, టెలీ మార్కెటర్స్ కాల్స్ ఆన్సర్ చేయడానికి మళ్ళీ బిజీ అయిపోతామండి"

"హ్హాహ్హాహ్హా..... హ్హాహ్హాహ్హా....."

"........"

".హ్హాహ్హాహ్హా.... ఒక్క నిమిషమండి శ్రీనివాస్ గారూ..... హ్హాహ్హాహ్హా పొట్టచెక్కలయ్యేలా నవ్వొస్తుందండి, మీ జోక్కు....హ్హాహ్హాహ్హా..."

"......."

"మీకు చాలా సెన్సాఫ్ హ్యూమర్ ఉందండీ, శ్రీనివాస్ గారూ!"

"......"

"మీరు ఇండియాలో ఎక్కడ ఉండేవారండి, శ్రీనివాస్ గారూ?"

"హైద్రాబాడ్‌లో ఉండే వాళ్ళమండి"

"హైదరాబాద్‌లో, ఎక్కడండి?"

"గాంధీ నగర్‌లో ఉండేవాళ్ళమండి"

"గాంధీనగర్‌లోనా?! మీకు బాలాజీ ఇంద్రప్రస్థ అపార్ట్‌మెంట్స్ తెలుసా?"

"బాలాజీ ఇంద్రప్రస్థ?! భలే వారే, మేము అదే అపార్ట్‌మెంట్లో సెకండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ నెంబర్ G-11-98-367/22-59Bలో ఉండేవాళ్ళం"

"అవునా?! నమ్మలేకుండా ఉన్నానండి, శ్రీనివాస్ గారూ! మేము నాలుగు సంవత్సరాలుగా అదే అపార్ట్‌మెంట్లో ఫోర్త్‌ఫ్లోర్‌లో ఫ్లాట్ G-11-98-4569/33A-62B లో ఉంటున్నాం"

"అవునా? చంపేసారండీ బాబు!"

"అవునండి, శ్రీనివాస్ గారు, చంపేసాను"

"మీకు ఫ్లాట్ నెంబర్ జి-11-98-596/56-67బిలో ఉండే సుబ్బారావ్ గారు తెలుసా? కాలేజీ లెక్చరర్‌గా రిటైర్ అయి, పిచ్చాస్పత్రి పాలయ్యారు...."

"భలేవారే, ఎందుకు తెలీదు? సుబ్బారావ్‌గారిప్పుడు తెలుగు టీ.వీ సీరియల్స్‌కి డైలాగులు రాస్తున్నారు......"

"అవునా! అయితే ఆయనకిప్పుడు పిచ్చి తగ్గిందన్న మాట"

"ఆయనకి పిచ్చి తగ్గిందని ఎవరన్నారు?"

"మీరే అన్నారుగా, ఆయనిప్పుడు టీ.వీ సీరియల్స్‌కి మాటలు రాస్తున్నారని"

"అవునండీ శ్రీనివాస్ గారు. ఆయన టీ.వీ. సీరియల్స్‌కి మాటలు రాస్తున్నారు"

"........"

"అవును శ్రీనివాస్‌గారు, నన్ను మీరు చూసే ఉంటారు, నేను గత మూడు సంవత్సరాలుగా 'మిస్ బాలాజీ ఇంద్రప్రస్థ' బ్యూటీ కాంపిటీషన్‌లో విన్నర్‌ని"

"........"

"హలో! శ్రీనివాస్‌గారూ, లైన్‌లో ఉన్నారా?"

"ఆ ... ఉన్నానండీ అమూల్యగారు.... సో మీరు 'మిస్ బాలాజీ ఇంద్రప్రస్థ'...." మన అపార్ట్‌మెంట్‌లో అలాంటి పోటీలు ఉన్నట్టు నాకు తెలీదండి... అయితే మీరు చాలా అందంగా ఉంటారన్న మాట...."

"హిహి... ఈ పోటీల గురించి మీకు తెలీక పోవడం చాలా విచిత్రంగా ఉందండి, అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ వాళ్ళు చాలా పోస్టర్లు తయారు చేసి కాళీ కనిపించిన ప్రతి చోటా అంటిస్తారండి"

"........"

"అసలు ఆ పోస్టర్లు చూసే నేను ఇంప్రెసివ్‌గా ఉన్నానని నాకు ఈ కాల్ సెంటర్‌లో ఉజ్జోగం ఇచ్చారు."

".....అవునా?! కాని కాల్ సెంటర్‌లో పన్జేసే మిమ్మల్ని కష్టమర్స్ ఎప్పుడూ చూడరుగా? ఇంక వాళ్ళెలా ఇంప్రెస్ అవుతారండి?"

"........"

"హలో?"

"..... హ్హిహ్హి... భలే జోక్కులేస్తారండీ మీరు, శ్రీనివాస్ గారూ!"

"అయితే మీరు 'మిస్ బాలాజీ ఇంద్రప్రస్థ' అన్నమాట... నాకు నిజంగా ఈ పోటీల గురించి తెలీదండి, తెలిస్తే తప్పకుండా అటెండ్ అయ్యేవాడ్ని .... మిమ్మల్ని చూసుండే వాడ్ని..."

"మేబీ, మీరిక్కడ ఉన్నప్పుడు ఈ పోటీ అంత పాపులర్ కాదేమో, రెండు సంవత్సరాలుగా ఇది ఒక బిగ్ ఈవెంట్ అండి"

"........"

"మీరు అమెరికా వెళ్ళి ఎన్నాళ్ళైందండీ, శ్రీనివాస్ గారూ?"

"....జస్ట టూ మంత్స్ అయిందండి. రెణ్ణెళ్ళ క్రితం వరకూ నేను బాలాజీ ఇంద్రప్రస్థలోనే ఉండేవాడ్ని"

"........"

"హలో?"

"... జస్ట్ టూ మంత్స్? అబ్బా! జస్ట్ టూ మంత్స్ లోనే మీకు అమెరికన్ ఆక్సెంటు ఇంతలా ఎలా వచ్చిందండీ?"

"అమెరికన్ ఆక్సెంట్? భలే వారే అమూల్యగారూ, అసలు మనం ఇంగ్లీషులో మాట్లాడ్లేదు కదా? నా ఆక్సెంట్ ఎలా పసిగట్టారు?"




"పొండి శ్రీనివాస్ గారూ, మీరు మరీనూ, అక్కడక్కడ మీరు యూజ్ చేసిన పదాలు చూస్తే తెలీడం లేదూ? మీ ఆక్సెంట్ అమెరికన్ ఆక్సెంట్‌లా ఉందని!"

"........"

"మరి మీ లాంగ్ డిస్టెంస్ సర్వీసు ఏ.టి.అన్.టికి స్విచ్ చేస్తారా, శ్రీనివాస్ గారూ?"

".... ఐ హోప్ టు తింక్ ఎబోటిట్ అండి,...... డసన్ట్ సీం లైక్ అయామ్ గెయినింగ్ ఎనితింగ్ బై స్విచ్చింగ్"

"యూ సౌండ్ సో యంగ్ అండ్ చార్మింగ్ అండి, శ్రీనివాస్ గారు, అసలు మనం బాలాజీ ఇంద్రప్రస్థలో కలిసుండాల్సిందండి"

"..... అవునండీ, మీరు చాలా ఫన్ లవింగ్ ఎంగ్ లేడీలా ఉన్నారు, మనం కలిసి ఉండాల్సిందండి.... 'మిస్ బాలాజీ ఇంధ్రప్రస్థ' గారూ"

"మనం మళ్ళీ తప్పకుండా కలవాల్సిందండి, శ్రీనివాస్ గారూ"

"ఐ అగ్రీ... మళ్ళీ, మళ్ళీ తప్పకుండా కలిసుండాల్సింది... మీకు పెళ్ళైందా అమూల్యగారు?"

"లేదండి, మరి మీకు?"

"........"

"హల్లో!"

"... ఆ !లైన్ లోనే ఉన్నానండి, చూసారా, ఎంత చిత్రమో మనం ఒకే అపార్ట్‌మెంట్‌లో ఉండి ఎప్పుడూ కలుసుకోలేదు... ఇంత కాలానికి ఇంత దూరంలో ఉండి, ఇప్పుడు ఇలా ఫోన్‌లో కలుసుకున్నాం... ఎక్కడి అమెరికా? ఎక్కడి ఆముదాలవలస?"

"ఆముదాలవలస? ఆముదాలవలస ఎక్కడ్నిండొచ్చిందండి, నేను మాట్లాడేది హైదరాబాద్ నుండి కదా?"

"ఆముదాలవలస ఎక్కడ్నిండీ రాలేదండీ! ఊరికే ప్రాస కలిసిందని అలా అన్నాను"

" ఓహ్హో.... హ్హహ్హహ్హ... అబ్బా మీరు భలే జోకులేస్తారండి. ఆముదాలవలస!.....హ్హహ్హహ్హ..."

"........"

"హ్హ హ్హ హ్హ"

"........"

"సో మీరు ఏ.టి. అన్‌టీకి స్విచ్చవుతారుగా శ్రీనివాస్ గారూ?!"

".... ఊ... ఆలోచించి...."

"హ్హ హ్హ హ్హ... ఇహ్హిహ్హిహ్హి.. ఆముదాలవలస.... హ్హహ్హ... భలే తమాషాగా మాట్లాడ్తారండీ మీరు, శ్రీనివాస్ గారూ..."

"ఒకే... మా సర్వీసు ఏ.టి.ఎన్.టీకి స్విచ్ చేస్తామండి అమూల్యగారూ!"

"ఒకే! ఇట్ టేక్స్ వన్ అవర్ ఫర్ ద స్విచ్చింగ్ ప్రాసెస్ టు బి కంప్లీటెడ్, ది కాల్స్ యూ ప్లేస్ ఆఫ్టర్ ఆన్ అవర్ విల్‌బి బిల్లుడ్ బై ఏ.టి.అన్.టి .... వెల్‌కంటు ఏ.టిఅన్‌టి.... యు హావే వండర్‌ఫుల్‌డే సర్.... బైబైనవ్."

".. ..సో యూ ఆ ర్ 'మిస్ బాలాజీ ఇంద్రప్రస్థ'... హ్హ.... హలో... హల్లో ... అమూల్యగారూ... హల్లో అరె ఫోన్ పెట్టేసిందే.. హలో..."

❀❀❀❀

"అవును డాడీ. మీకు అక్కడ ఉదయం ఆరు గంటలైతే మాకిక్కడ సాయంత్రం ఏడున్నర అవుతుంది" వాగ్దేవి వాళ్ళ నాన్నతో ఫోన్‌లో మాట్లాడుతుంది.

"మీకు ఏడు గంటలైతే మాకిక్కడ ఎనిమిదిన్నర, డాడీ"

"మీకక్కడ ఎనిమిదైతే మాకిక్కడ తొమ్మిదిన్నరన్నమాట..."

"... ఉదయం తొమ్మిదైతే మాకిక్కడ రాత్రి పదిన్నర..."

".... పదకొండంటే... మాకిక్కడ రాత్రి పన్నెండున్నర..."

".... ఆ..... మాకు అర్థరాత్రి దాటి ఓటిన్నర..."

ఓర్నాయనోయ్... మాకిక్కడ ఉదయం ఎనిమిదయ్యే సరికి ఫోన్ బిల్లు పాతికౌతుంది, ఇక ఆలస్యం చేయకుండా వాగ్దేవి చేతిలో రిసీవర్ లాక్కున్నాను.

"నమస్కారం మావయ్యగారూ... బాగున్నారా?"

"మేము బాగున్నాం బాబూ, మీరెలా ఉన్నారు?"

"మేము బాగున్నామండి"

"మంచిది బాబూ, మేం బాగున్నాం బాబూ"

"....మంచిదండి"

"...ఇంకా ఏంటి బాబు..."

"చెప్పండి మామయ్యగారు, ఇంకా ఏంటి విశేషాలు?"

"ఏముంటాయి బాబూ... ఇంకా మీ విశేషాలేంటి?"

"ఏముంటాయండీ?... మీరే చెప్పాలి... ఇంకా ఏంటి విశేషాలు?"

"........"

"........"

"అది సరే కాని అల్లుడు గారూ, ఇది చాలా చిత్రంగా ఉందే.. మాకిక్కడ ఉదయం ఆరవుతుంటే మీకక్కడ ఏమౌతుంది? ఎనిమిదా? తొమ్మిదిన్నరా...?"

".... మాకిక్కడ సాయంత్రం ఏడున్నర అవుతూంటుందండి......."

"అబ్బా... ఏడున్నరే....! ఐతే మాకిక్కడ ఉదయం ఏడవుతే మీకక్కడ ఎంత టైమౌతుంది?"

"మాకిక్కడ రాత్రి ఎనిమిదిన్నర అవుతుందండి! అక్కడికీ, ఇక్కడికీ ఓ....."

"అబ్బా! ఎనిమిదిన్నరే! మరి మాకు ఇక్కడ ఉదయం ఎనిమిదౌతుందనుకో, మీకక్కడ ఎంతవుతుందీ...?"

"...అబ్బా... మామయ్యగారూ... మీకూ, మాకూ దాదాపుగా పదమూడూ, పద్నాలుగు గంటలు డిఫరెన్స్ ఉంటుం..."

"పదమూడూ, పద్నాలుగు గంటలా.... మరి మాకిక్కడ ఉదయం ఎనిమిది కొట్టిందనుకో, మీకక్కడ ఎంత కొడుతుంది?"




"మీకక్కడ ఉదయం ఎనిమిది కొడితే, మాకిక్కడ ఏమీ కొట్టదండీ, మీరు మాకన్నా పదమూడున్నర గంటలు ముందుంటారండీ! అంతే!"

"పదమూడున్నర గంటలు ముందుంటామా? ఏదీ - ఇక్కడ ఉదయం ఎనిమిది గంటలకి.... మరి అక్కడ ఉదయం తొమ్మిది గంటలకి. మేం మీకన్నా ఎంత ముందుంటాం?"

"తొమ్మిదైనా, పదైనా, మీరు మా కన్నా పదమూడున్నర గంటలు ముందుంటారండీ... ఇంకా..."

"అయితే ఇక్కడ పదిగంటలకి అక్కడ ఎంత టైం అవుతుందంటారూ?"

"....అదికాదం.... అక్కడ ఉదయం పదైతే, మాకిక్కడ రాత్రి పదకొండున్నర అవుతుంటుంది"

"ఇదిగో నిన్నే! ఆ టీవీ ఆపేసి ఓసారిలారా! మనకిక్కడ ఉదయం పదౌతే వాళ్ళకక్కడ రాత్రి పదకొండున్నరౌతుందట"

"......."

"మాకిక్కడ పదకొండవుతే, మీకక్కడ ఏ టైం అవుతుందని కనుక్కోమంటుంది బాబూ, మీ అత్తయ్య"

"మాకిక్కడ రాత్రి పన్నెండున్నర అవుతుందండి... మామయ్యగారూ, మీకు టైం డిఫరెన్స్ అన్నీ ఒక పేపర్ మీద రాసి పోస్ట్లో పంపిస్తామండీ,.... ఫోన్లో అవన్నీ మాట్లాడాలంటే చాలా మనీ అవుతుందండీ, నిమిషానికి ముప్పై ఐదు సెంట్లు..."

"అబ్బా! ముప్పై ఐదు సెంట్లే.. అంటే ఎన్ని డాలర్లు, అల్లుడుగారూ?"

"...డాలర్కి వంద సెంట్లండి, అంటే దాదాపు మూడు నిమిషాలకి ఒక డాలర్ అవుతుందన్న మాట... మీకు తెలుసు కదా డాలర్కి దాదాపు నలభై మూడు రూపాయలు... అంటే మేం మీతో మాట్లాడ్డానికి నిమిషానికి దాదాపు పదహారు రూపాయలౌతుందన్న మాట..."

"ఓ.... అవునా? ఐతే పదినిమిషాలు మాట్లాడ్డానికి ఎన్ని డాలర్లు అవుతాయి బాబూ?"

"పదినిమిషాలంటే... మూడు డాలర్ల ఏభై సెంట్లవుతుంది"

"...అంటే ఎన్ని రూపాయలో?"

"... దాదాపు నూట ఏభై రూపాయలు...."

"ఒక్క నిమిషం బాబూ! నిన్నే! ఆ టీ.వీ కట్టేసి ఇలా వస్తావా లేదా? ఇది విన్నావా? వాళ్ళు మనతో మాట్లాడ్డానికి పది నిమిషాలకి దాదాపు నూట యాభై రూపాయలు ఖర్చవుతుందట.... ఫోన్లో ఇంకెప్పుడూ వాగ్ధేవితో సొల్లు కబుర్లు చెప్పి వాళ్ళ డబ్బు తగలెయ్యకు!"

"......."

"ఐతే ఇరవై నిమిషాలు మాట్లాడితే ఎన్ని రూపాయలౌతుంది, అల్లుడుగారూ?"

"......."

"హలో"

"......."

"... అవునూ మళ్ళీ గుర్తుంటుందో లేదో, మేము మీకన్నా ముందుంటామన్నారు కదా, ఐతే మాకిక్కడ సోమవారమైతే, మీకూ సోమవారమేనా?"

"అది డిపెండ్స్ అండి.... మీకు సోమవారం ఉదయమైతే మాకిక్కడ ఆదివారం రాత్రి - మీకు సోమవారం రాత్రైతే మాకిక్కడ సోమవారం ఉదయం అన్నమాట"

"చిత్రంగా ఉందే! అయితే మాకు మార్చి ఫస్ట్ రాత్రి అవుతే మీకూ మార్చి ఫస్టే కానీ ఉదయం అన్నమాట"

"అవునండి, మామయ్యగారూ చాలా కరెక్ట్‌గా చెప్పారు!"

"మరి మాకు మార్చి ఫస్ట్ ఉదయం అవుతే?"

"మాకు ఫిబ్రవరి ఇరవై ఎనిమిది రాత్రి!"

"ఫిబ్రవరి ఇరవై ఎనిమిది రాత్రి!"

"మరి లీఫ్ ఇయర్‌లో మాకు మార్చి ఫస్ట్ ఉదయం అయితే మీకు అక్కడ...?"

"........"

"రెండు వేలా ఏడు లీఫ్ ఇయరా...?"

"........"

"రెండు వేలా ఎనిమిది....?

"........"

"హల్లో.... అల్లుడుగారూ...?... హల్లో.... హల్లో..... అల్లుడు...... అరె పెట్టేసాడే... హల్లో...."

"........"

❀❀❀




"వాగ్దేవీ, ఇది చూసావా, మెయిల్‌లో ఏదో పెద్ద ప్యాకెట్ వచ్చింది కొత్త టెలీఫోన్ డైరక్టరీ అనుకుంటా..."

"టెలీఫోన్ డైరక్టరీ కాదు, ఏం కాదు, మన టెలీఫోన్ బిల్స్..."

"........"

ఓపెన్ చేసేముందు.... ఇది శ్రద్ధగా వినండి.... కోటబుల్ కోట్స్ .... కాదు.... వర్డ్స్ ఆఫ్ విస్డమ్.... డబ్బు శాశ్వతం కాదూ, జబ్బూ శాశ్వతం కాదు, కేవలం వాళ్ళు మాట్లాడే మాటలు తప్ప అన్నీ .... అశాశ్వతమే...."

"ఇదేంటీ మూడు బిల్లులొచ్చాయి.... మొత్తం పన్నెండొందల డాలర్లా.... పన్నెండొందలే?`````` ఫోన్ బిల్లు పన్నెండొందలా......???"

"........"

మూడు డిఫరెంట్ కంపెనీలనుండి బిల్స్ వచ్చాయేంటీ? ఇదేంటీ..... ఎం.సి.ఐ నుంచి కూడా బిల్లొచ్చింది? మనం స్విచ్ అయింది ఏటీ.ఎన్‌టీ కదా?

"..... ఏటీ.అన్‌టి??? ఏటీ.అన్‌టీకి ఎప్పుడు స్విచ్చయ్యాం?... అసలెందుకు స్విచ్చయ్యాం శీనూ?"

"........"

"... మినెట్‌కి ముప్పై ఐదు సెంట్లే...? స్టార్‌టెక్‌లో ఇరవై రెండు సెంట్లేకదా? ఎక్కువ ప్రైస్ ఉన్నా కూడా ఎందుకు స్విచ్చయ్యాం?"

'ఏ.టి.ఎన్.టికి వరల్డ్‌వైడ్‌గా కస్టమర్ సర్వీస్ సెంటర్‌లు, ట్వంటీ ఫోర్ అవర్స్ ఏడే, సెవన్ డేస్ ఏ వీక్, మనకే ప్రాబ్లెం వచ్చినా అందుబాటు...."

"వరల్డ్‌వైడ్‌గా?"

"అంటే ఇండియా మొత్తం అనుకో"

"ఏ. పి మొత్తం?"

"... అద్సరే, మరి ఎం.సి.ఐ ఎక్కడ్నించొచ్చింది...? కొంపదీసి 'నువ్ కానీ స్విచ్ చేయలేదు కదా... వాగ్దేవి' ఎం.సి.ఐకి ఎందుకు స్విచ్ చేసావ్...?"

"... టెలీ మార్కెటర్ మొహమాట పెట్టేసాడండీ, కాదనలేక పోయాను..... ఏమన్నాడో తెల్సా? నేను చాలా ఫన్నీగా మాట్లాడతానట... అంతే కాదు, మీకీ విషయం తెల్సా, మన

బాలాజి ఇంద్రప్రస్థ అపార్ట్‌మెంట్‌లో ప్రతి సంవత్సరం 'మిస్టర్ బాలాజీ ఇంద్రప్రస్థ' పోటీలు జరుగుతాయట....."

"అసలు నీకేమైనా బుద్ధుందా? టెలీ మార్కెటర్ గాడు క్యూట్‌గా మాట్లాడాడని నీ ఇష్టమొచ్చినట్టు చేసేయడమే...."

"అలా ఎందుకు అరుస్తావు శీనూ, ఏ.టి.అండ్‌టి కన్నా ప్రైస్ తక్కువేగా, కొంతైనా సేవైందని సంతోషించు.... ఎట్‌లీస్ట్ నేను హానెస్ట్‌గా చెప్పాను ఎం.సి.ఐకి ఎందుకు స్విచ్ చేసానో.... నీలా డొంక తిరుగుడు సమాధానాలు చెప్పట్లేదు..."

"........"

"..... హలో పరధ్యానయ్య గారూ... ఏంటి సమాధానం లేదు... హల్లో నిన్నే.... శీనూ.... నిన్నే.... అరె పడిపోయాడు!!!"




❀❀❀